# సాక్ష్యం

ఆరోజు శనివారం.

ఉదయం పదిన్నరకు రోజూలా ఆఫీస్‌కి వెళ్ళలేదు విజయానంద్. కారులో సరాసరి మలక్‌పేటలోని రేస్‌కోర్స్‌కి వెళ్ళాడు. ఆరోజు జాక్‌పాట్ కొట్టినవాడు అదృష్టవంతుడు. అంతకు మునుపు జరిగిన రేస్‌లో ఎవరూ జాక్‌పాట్ సాల్వ్ చేయలేక పోయారు. కొన్ని లక్షల మొత్తం 'క్యారీ ఫార్వర్డు' అయింది, శనివారం రేసుకి. ఆ వుత్సాహంతో ఆఫీస్‌కి వెళ్ళకుండా సరాసరి రేస్‌కోర్సుకి చేరుకున్నాడు విజయానంద్.

లక్డీకా పూల్ ప్రాంతంలో వున్న రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఓకార్యాలయంలో ప్రధానాధికారిగా పనిచేస్తున్నాడు విజయానంద్. క్లాస్‌వన్ ఆఫీసరు. నాలుగంకెల జీతం వస్తున్నా, డబ్బు మీద ఆశ చావలేదు విజయానంద్‌కి. అతనికున్న ఒకే ఒక చెడ్డ అలవాటు గుర్రప్పందాలు.

హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు కాబట్టి విజయానంద్ రాకపోకలమీద ఆంక్షపెట్టే వారెవరూ లేరు ఆఫీస్‌లో. సాధారణంగా ఉదయం పదకొండున్నర పన్నెండు మధ్య ఆఫీస్‌కి వెళ్ళి మూడున్నర నాలుగు మధ్య ఇంటికి వెళ్ళి పోతాడు. అత్యవసరమైన పని వస్తే ఇంటికి ఫోన్ చేస్తారు ఆఫీస్ నుంచి సూపరింటెండెంట్ కాని, హెడ్ క్లర్కు గాని. అలా అవసరం వచ్చిన సందర్భాలు అతి స్వల్పం.

విజయానంద్ ఏభై జాక్‌పాట్ టిక్కెట్లు కొనుక్కొని, బైనాక్యులర్సుతో రేసులని ఆసక్తిగా గమనించ సాగాడు, పైపు తాగుతూ హుషారుగా, 'కమాన్ క్వీన్ ఆఫ్ క్వీన్స్' అనో, 'ఫాస్టర్ ఫాస్టర్' అనో అరవసాగాడు తనుకూడా మిగతా వాళ్ళతో పాటుగా.

* * *

సతీసమేతంగా మంత్రిగారు సినిమాకు వచ్చారా రోజు. ముందరే చెప్పటం వల్ల ఆ థియేటరు యజమాని మంత్రిగారిని స్వయంగా వారికోసం ప్రత్యేకించిన సీట్లలోకి తీసుకెళ్ళాడు.

"సినిమా చాలా బావుందండి" అన్నాడు థియేటరు యజమాని. ఓ పావుగంట తను కూడా కూర్చుని తర్వాత పని వుందని లేచి వెళ్ళి పోయాడు;

* * *

ఆ మర్నాడు రెండు గంటలకే వెళ్ళి పోయాడు విజయానంద్ ఆఫీస్ నుంచి. సాయంత్రం నాలుగున్నరకి ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చింది. హెడ్ క్లర్కు కంగారుగా చెప్పాడు. 'సర్, మంత్రి గారి పి. ఏ. ఫోన్ చేశారు మీకోసం ఇప్పుడే.'

'దేనికి?'

మల్లాది వెంకటకృష్ణమూర్తి

'తెలియదు. వంట్లో బావుండక ఇప్పుడే ఇంటికి బయలుదేరారని చెప్పాను. ఓ పావు గంటాగి మీకు ఫోన్ చేస్తానన్నారు.'

"సరేఅయితే."

పది నిముషాల తర్వాత మళ్ళీ ఫోన్ మ్రోగింది.

మంత్రిగారి పి. ఏ.

"ఉన్న పళంగా మంత్రిగారు మిమ్మల్ని, వాళ్ళ ఇంటికి వెళ్ళి కలుసుకోమని చెప్పారు. మీ కోసం ఎదురు చూస్తున్నారు."

క్లిక్.

ఆదరాబాదరాగా విజయానంద్ కారులో మంత్రిగారింటికి వెళ్ళాడు, తలనిండా వివిధ ఆలోచనలతో.

"వెల్ మిష్టర్ విజయానంద్! నా మంత్రిత్వశాఖ కింద వచ్చే ఆఫీసుల్లో పని సరిగా జరగడంలేదన్న ఆరోపణ వచ్చింది. మూడు వారాలక్రితం శనివారం మీరు ఆఫీసులో చేసిన పని డైరీ వ్రాసి ఇవ్వండి రేపు మధ్యాహ్నం లోగా. గుర్తుంటే ఇప్పుడే రాసివ్వండి "

"గుర్తుంది రొటీన్ వ్రాసిస్తాను సర్!"

ఉదయం పదిన్నర నుంచి సాయింత్రం అయిదున్నరదాకా తను చేసే పనిని వ్రాసి అందించాడా కాగితం. ఆ కాగితాన్నందుకుని మంత్రిగారు చిన్నగా నవ్వి అడిగారు.

"ఆ రోజు శెలవలో లేరా మీరు ?"

"ఉహు."

"అలా అయితే మిమ్మల్ని సస్పెండ్ చేస్తున్నాను."

విజయానంద్ నోటమాటరాలేదు, తెల్లబోతు చూశాడు మంత్రిగారి వంక.

"యస్. యు ఆర్ సస్పెండెడ్. రేపు ఉదయం సస్పెన్షన్ ఆర్డర్ టైప్ చేయించి అందజేస్తాను. శ్రద్ధగా పనిచేసే వుద్యోగులు కావాలి నాకు. జూదం ఆడేవాళ్ళు కాదు."

"మీరేమంటున్నారో ఎవరి గురించి మాట్లాడుతున్నారో అర్థం కావటం లేదు నాకు."

"మీ గురించే."

"నన్ను సస్పెండ్ చేయాల్సిన అవసరం ఏమిటి ?"

"పర్మిషన్ లేకుండా ఆఫీసుటైంలో ఆఫీస్ వదిలి బయటికివెళ్ళటం. ఆఫీస్‌కి టైంకి రావటం లేదని కూడా తెల్సింది."

"అబద్ధం"

"అబద్ధం ఆడకు మిష్టర్ విజయానంద్. మీరు ఇచ్చిన డైరీ నా జేబులో వుంది. అది అబద్ధం అని నిరూపించడానికే అడిగి తీసుకున్నాను. ఆ రోజు మలక్‌పేటలోని రేసుల కెళ్ళారు మీరు అవునా ? కాదా ?"

"కాదు."

చిన్నగా నవ్వారు మంత్రి.

"ఐ హేవ్ ఫుల్‌ప్రూఫ్ ఎవిడెన్స్. ఇండియన్ న్యూస్ రివ్యూ వారు ఆ రోజు రేసుని చిత్రీకరించారు. ప్రేక్షకుల లో కూర్చున్న కొంతమందిని కూడా చిత్రీకరించారు. నిన్నరాత్రి సినిమా కెళ్తే ఐ.ఎన్.ఆర్. లో మీరు కనిపించారు. నోట్లో పైప్‌తో చేతిలో బైనాక్యులర్స్‌తో స్పష్టంగా కనిపించారు మీరు. ఇక మీరు వెళ్ళొచ్చు' ఆఫీస్ టైంలోనే జరిగిందా రేసు."

విజయానంద్ తనని బ్రతిమాలుకునే అవకాశం ఇవ్వకుండా మంత్రిగారు తమ ఇంట్లోని విజిటర్స్ గదిలోంచి లోపలకి వెళ్ళిపోయారు. ✱